ఈనాడు అనంతపురం

గురువారం అక్టోబరు 24, 2024

గత ప్రభుత్వ నిర్లక్ష్యమే వరదలకు కారణం: ఎమ్మెల్యే సునీత



తెగిపోయిన బండమీదపల్లి చెరువు కట్టను పరిశీలిస్తున్న సునీత, నాయకులు, అధికారులు

రాప్తాడు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు మునగడానికి కారణమైందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కురిసిన భారీ వర్షాలకు రాప్తాడు మండలం బండమీదపల్లి చెరువు తెగిపోయింది. బుధవారం పరిటాల సునీత అధికారులతో కలసి చెరువును పరిశీలించారు. చెరువు కింద ముంపునకు గురైన వరి, చీనీ పంటలు, కోతకు గురైనా పంట పొలాలను పరిశీలించారు. బాధిత రైతుల కష్టాలు విన్నారు. గత ప్రభుత్వంలో ఏరోజూ చెరువులకు మరమ్మతులు గానీ, కాలువల స్థితిగతులను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతమున్న పరిస్థితిని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడి దృష్టికి తీసుకెళ్లామని ఒకసారి జిల్లాకు వచ్చి పంటలను పరిశీలించాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో చెరువులు, కాలువలు తెగిపోయిన అంశాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి నివేదిక తెప్పించుకున్నారన్నారు. వాటి మరమ్మతులకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రతి రైతుకు పరిహారం అందే విధంగా చొరవ తీసుకుంటామని చెరువులకు, కాలువలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వతంగా నిలిచిపోయేలా పనులు చేస్తామని సునీత తెలిపారు.

వచ్చే రెండు రోజులు జాగ్రత్త

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా.. జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లాలో ప్రవహిస్తున్న హగరి, చిన్న హగరి, పెన్నా, చిత్రావతి, పండమేరు.. వంటి నదులు ఉద్ధృతంగా ప్రవహించే అవకాశం ఉందని, ఈ నదుల పరివాహక ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నదుల పరివాహక ప్రజలే కాదు... జలాశయాల వద్దకు కూడా ఎవరూ వెళ్లొద్దన్నారు. ఎగువన ఉన్న కర్ణాటక రాష్ట్రంలో భారీ వానలు పడుతున్నాయి. మన జిల్లాలోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలు సురక్షిత నివాసాలకు వెళ్లాలని సూచించారు.

రైల్వే సమస్యలకు పరిష్కారం చూపండి: ఎంపీ



రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే : రైల్వే సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గం చూపాలని అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ కోరారు. రైల్వే సమస్యలపై బుధవారం సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బెంగళూరు ప్యాసింజర్ రైలును అనంతపురం వరకు పొడిగిస్తూ ఉత్తర్వులను ఎంపీ అందజేశారు. రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను అనంతపురం స్టేషన్‌లో ఆపాలని, కిసాన్ రైలును ప్రారంభించాలని జీఎంను ఎంపీ కోరారు. అనంతపురం రైల్వేస్టేషన్‌లోని లిఫ్ట్, ఇతర పనులను పూర్తి చేయాలని ఎంపీ కోరారు. బెంగళూరు ప్యాసింజర్ రైలును అనంతపురం వరకు పొడిగించి త్వరలో ప్రారంభిస్తామని జీఎం చెప్పినట్లు ఎంపీ తెలిపారు.

ప్రమాదం అంచున చెరువులు



- ప్రధాన కట్టలు, షట్టర్లు బలహీనం
- చిన్న వర్షాలకే గండ్లు, రంధ్రాలు
- ఐదేళ్ల నిర్వహణ లోపమే కారణం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: 'గ్రామ సంపద'గా భావించే చెరువులు ప్రమాదం అంచున కొట్టుమిట్టాడుతున్నాయి. చిన్నచిన్న వానలకే వణుకుతున్నాయి. ఎక్కడికక్కడ రంధ్రాలు, గండ్లు పడటమే కాదు.. ప్రధాన కట్టలు సైతం తెగిపోయే పరిస్థితులు తలెత్తాయి. సోమవారం అర్ధరాత్రి కురిసిన వానలకే కనగానపల్లి, బండమీదపల్లి చెరువుల కట్టలు తెగిపోవడమే నిలువెత్తు నిదర్శనం. వీటి మూలంగా అనంత సాగరంవైపు వచ్చే పండమేరు వంక ఉగ్రరూపం దాల్చి.. అనంత నగర శివారుకాలనీలు జలమయమయ్యాయి. వందలాది కుటుంబాలు నీటి దిగ్బంధంలో చిక్కుకుని చిగురుటాకుల్లా వణికిపోయాయి. గడిచిన ఐదేళ్లు వైకాపా ప్రభుత్వం గ్రామ సంపదపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడమే ప్రధాన కారణం. చెరువుల నిర్వహణ, మరమ్మతులకు నయాపైసా నిధులు ఇవ్వలేదు. సరికదా.. పూర్తిగా నిర్వీర్యం చేసింది. దాని ఫలితమే ఇప్పుడీ దుస్థితి. కరవు ప్రాంతంగా ముద్రపడిన ఉమ్మడి అనంత జిల్లాలో ఈదఫా ఆశించిన మేర వరుణుడు కరుణించాడు. నిర్దేశిత వర్షపాతం కంటే రెట్టింపు స్థాయిలో వాన కురిసింది. దీంతో అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. ఎక్కడికక్కడ చెరువుల్లోకి నీరు చేరుతోంది. ఈ నీటిని సంరక్షించే బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. గండ్లు, రంధ్రాలు పడకుండా ముందస్తు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ దిశగా జలవనరుల ఇంజినీర్లు తగిన శ్రద్ధ చూపకపోతే గ్రామ ప్రయోజనాలు తీర్చే నీరంతా వృథా అయ్యే పరిస్థితి ఉంటుంది.


క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి అవసరం

అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో చాలాచోట్ల చెరువులకు రంధ్రాలు, గండ్లు పడ్డాయి. చెరువుల ప్రధాన కట్టలు, షట్టర్లు, తూములు.. వంటి వాటికి సత్వరమే మరమ్మతులు అవసరం. శింగనమల చెరువు షట్టర్ పైకి ఎత్తితే కిందకు దిగని దుస్థితి. గతంలో ఇదే సమస్య ఎదురైంది. ఇప్పటికే కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లి, శెట్టూరు మండలం ములకలేడు, కుందుర్పి మండలం రుద్రంపల్లి, గుత్తి మండలం జక్కలచెరువు, పామిడి మండలం అనుంపల్లి, రాయదుర్గం మండలం డి.కొండాపురం, బొమ్మక్కపల్లి, బ్రహ్మసముద్రం మండలం సంత్‌కొండాపురం, పోలేపల్లి, మామిడూరుకుంట, కుచ్చుబాయికుంట.. వంటి చెరువులకు గండ్లు పడిన సంగతి తెలిసిందే. తాజాగా శ్రీసత్యసాయి జిల్లాలో అనేక చెరువులకు ఇదే తరహా రంధ్రాలు, గండ్లు పడ్డాయి. వాటిని యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయకపోతే నీరంతా వృథా అయ్యే పరిస్థితి తలెత్తనుంది. జలవనరులశాఖ మాత్రం రంధ్రాలు, గండ్లు వివరాలను దాచిపెడుతోంది. దీనివల్ల మేలు కంటే.. కీడే ఎక్కువ జరగనుంది.

సత్వరమే మరమ్మతులు

- గారపాటి విశ్వనాథ్‌రెడ్డి, ఎస్ఈ, జలవనరుల శాఖ

చెరువులపై పూర్తి నిఘా ఉంచాం. ఎక్కడా ఏ సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. చాలా చెరువులు నిండి మరువ పారాయి. చిన్నచిన్న మరమ్మతులు సత్వరమే చేస్తున్నాం. కలెక్టర్ కూడా తగిన ఆదేశాలు ఇచ్చారు. కంపలు, చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.



చెరువుల్లో నీటి చేరిక వివరాలు

అనంతలో చెరువులు **301**

శ్రీసత్యసాయి జిల్లాలో.. **1,186**

ఉమ్మడి అనంత జిల్లాలో చెరువుల వివరాలు

అంశం	అనంత	శ్రీసత్యసాయి	మొత్తం
చెరువులు	301	1186	1487
ఆయకట్టు(ఎకరాలు)	39,044	83,486	1,22,530
నీటి సామర్థ్యం(టీఎంసీ)	7.655	15.324	22.979
ప్రస్తుత నీటి నిల్వ(టీఎంసీ)	4.138	6.967	11.105



నిండుగా అనంత సాగరం చెరువు

దీపావళి నుంచే వెలుగులు

- నాలుగు నెలలకొక సిలిండర్ పంపిణీ
- ఉమ్మడి జిల్లాలో 12,08,293 కుటుంబాలకు లబ్ధి



రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీని దీపావళి పండగ రోజు నుంచే శ్రీకారం చుట్టనుంది. ఈ మేరకు బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ పథకానికి ఆమోదం తెలిపింది. ఈనెల 24 నుంచి సిలిండర్ బుకింగ్ చేసుకోవచ్చని.. 31వ తేదీ నుంచి ఉచిత గ్యాస్ అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. ఒకేసారి మూడు సిలిండర్లు కాకుండా నాలుగు నెలలకొకటి చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. సిలిండర్‌కు డబ్బులు చెల్లిస్తే.. 48 గంటల్లో తిరిగి లబ్ధిదారుల ఖాతాల్లోకి రాయితీ సొమ్ము జమ చేస్తారు. మహిళలకు ఆర్థిక భారం తగ్గింపు, జీవన ప్రమాణాలు పెంచేందుకు వీటిని పంపిణీ చేయనున్నారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు అందించడమే కాకుండా మహిళల్లో ఆనందం నింపాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం.

ఏడాదికి రూ.315.18 కోట్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 12,54,911 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తెల్లకార్డుదారుల ప్రాతిపదికన తీసుకుంటే 12,08,293 కుటుంబాలకు అర్హత ఉంది. వీరందరికీ ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇవ్వాలంటే ప్రభుత్వంపై ఏడాదికి మొత్తం రూ. 315.18 కోట్లు చొప్పున ఐదేళ్లకు మొత్తం రూ. 1,576 కోట్ల భారం పడుతుంది. ప్రస్తుతం గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ. 869.50. ఇందులో రూ. 50 రాయితీ లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటికే జమ అవుతుంది. మిగిలిన రూ. 819.50 లబ్ధిదారుల ఖాతాల్లోకి 48 గంటల్లో జమ చేస్తారు. వినియోగదారు సొమ్ము చెల్లిస్తే.. తర్వాత మొత్తం పారదర్శకంగా రాయితీ సొమ్ము ఖాతాల్లో జమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీపై మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉందని శ్రీసత్యసాయి జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

అనర్హులను తొలగించేందుకు ఈ-కేవైసీ

ఈ పథకంలో భాగంగా గ్యాస్ కనెక్షన్ నంబరుకు, ఆధార్ నంబరు అనుసంధానం చేసుకోవాలని (ఈకేవైసీ) గ్యాస్ డీలర్లు వినియోగదారులను ఒత్తిడి చేస్తున్నారు. గత 2023 నవంబరు నుంచి ఆయా కంపెనీలు గ్యాస్ ఏజెన్సీల ద్వారా ఈకేవైసీకి శ్రీకారం చుట్టాయి. వినియోగదారులు ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పటి వరకు కేవలం 50 శాతం మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని ఆయిల్ కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. కానీ, 1999లో అప్పటి తెదేపా ప్రభుత్వం దీపం పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 4,09,764 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. గ్యాస్ కనెక్షన్ ఉన్న వేలాదిమంది వినియోగదారులు చనిపోయారని, వారి పేరు మీదున్న కనెక్షన్లు ఇతరులు వాడుకుంటున్నట్లు కంపెనీలు గుర్తించాయి. వీటితోపాటు 7,48,218 సాధారణ కనెక్షన్లు ఉన్నాయి. మరో 96,929 ఉజ్వల, ఇతర కంపెనీలకు సంబంధించినవి ఉన్నాయి. దశాబ్దాల కిందటే లక్షలాది మంది కనెక్షన్లు తీసుకున్నారు. వాటిలో వేలమంది చనిపోయారు. మృతుల పేరుతో ఉన్న కనెక్షన్లు తొలగించేందుకే ఈకేవైసీ చేయిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఎక్కడ కనెక్షన్ తొలగిస్తారోనన్న భయం అనర్హుల్లో వెంటాడుతోంది. కాగా.. ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీకి, ఈకేవైసీకి ఎలాంటి సంబంధం లేదని ఆయిల్ కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు.



జల దిగ్బంధంలో అంబేడ్కర్ కొట్టాల



ఆటోనగర్ కాలనీలో..

బాధితుల కళ్లలో పండమేరు భయం



ఉప్పరపల్లి జగనన్న కాలనీలో నీటి నిల్వ

అశోక్‌నగర్ (అనంతపురం), రాప్తాడు, న్యూస్‌టుడే, ఈనాడు, అనంతపురం : పండమేరు ఉగ్రరూపానికి పరిసర కాలనీలు చిగురుటాకుల్లా వణికాయి. ఉన్నఫళంగా వచ్చిన వరద నీటికి ఉక్కిరి బిక్కిరి అయిన పేదల్లో మళ్లీ వరద వస్తే పరిస్థితి ఏంటన్న భయం వెంటాడుతోంది. కనగానపల్లి చెరువు కట్ట తెగిపోవడంతో పండమేరు పోటెత్తింది. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పంచాయతీ కళాకారుల కాలనీ, అనంతపురం గ్రామీణం ఉప్పరపల్లి పంచాయతీలోని జగనన్న కాలనీ, గురుదాస్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, ఆటోనగర్ కాలనీ, అంబేడ్కర్ కాలనీలు నీటమునిగాయి. మంగళవారం నడుము లోతు వరద ఉన్న ఈ ప్రాంతాలు బుధవారానికి తగ్గటంతో కొంత ఉపశమనం పొందారు. ఆయా ప్రాంతాల ప్రజలు తమ ఇళ్లలో వరదకు తడిసిన వస్తువులను తీసుకుని వచ్చి ఆరబెట్టుకున్నారు. అంబేడ్కర్ కొట్టాలలో నివాసం ఉంటున్న వారి గుడిసెలు చాలావరకు కూలి సామాన్లతో సహా వనమిత్ర పార్కులో తలదాచుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కడచూసినా తడిసిన వస్తువులను ఎండ బెట్టుకుంటున్న దృశ్యాలే కనిపించాయి. బుధవారం సాయంత్రం నిత్యావసర సరకులు పంపిణీ చేయడంతో వరద ప్రభావిత ప్రాంతాల్లోని ఉపశమనం లభించింది. ఈ కాలనీలకు సంబంధించిన రహదారులన్నీ మట్టిదారులు కావటంతో పలుచోట్ల నీరు అలాగే నిలిచి ఉండిపోయింది. ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించలేని స్థితి ఏర్పడింది.

పాత వంతెనపై రాకపోకలు బంద్

పండమేరు వంకపై 20 ఏళ్ల క్రితం నిర్మించిన పాత వంతెన పటిష్ఠతపై మంగళవారం వచ్చిన వరదతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. జాతీయ రహదారి విభాగపు అధికారులు బుధవారం ఈ వంతెన పరిశీలించి మరమ్మతుల నిమిత్తం వంతెనపై రాకపోకలు నిలిపేశారు. ఇటీవల నిర్మించిన కొత్త వంతెనపై రాకపోకలు సాగించాలని తెలిపారు.

అప్రమత్తత తప్పనిసరి

మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, చాలా అప్రమత్తంగా ఉండాలని కలెక్టరు ప్రకటించడంతో పలువురు వరద తగ్గినా ఇళ్లకు చేరుకోవడానికి భయపడుతున్నారు.



సామానుతో వనమిత్ర పార్కులో తలదాచుకున్న అంబేడ్కర్ కొట్టాల వాసులు...


సహాయక చర్యలు ముమ్మరం

నిత్యావసర సరకుల పంపిణీకి చర్యలు

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే : భారీ వర్షాలతో నష్టపోయిన వరద బాధితులకు సహాయక చర్యలు ముమ్మరం చేశామని, ఈనెల 22న వరద బాధితులకు పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి టిఫెన్, భోజనాలు ప్యాకెట్లు అందజేశామని కలెక్టర్ తెలిపారు. బాధితులకు నిత్యావసర సరకులు పంచాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆగమేఘాలపై బుధవారం 450 కుటుంబాలకు నిత్యావసర సరకులు సిద్ధం చేశామని మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, పౌరసరఫరాల శాఖ డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎం రమేశ్‌రెడ్డి, సహాయ మేనేజర్ ప్రసాద్ రాప్తాడు ఎంఎల్ఎస్ పాయింట్లలో నిత్యావసర సరకులు ప్యాకింగ్ చేశారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఉల్లిగడ్డలు 2వేల కిలోలు, బంగాళాదుంపలు 2 వేల కిలోలు, పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో బియ్యం 300 క్వింటాళ్లు, పామాయిల్ 600 కిలోల, కందిపప్పు ఆరు క్వింటాళ్లు సిద్ధం చేశారు. బుధవారం అనంతపురం గ్రామీణం ఉప్పరపల్లిలోని పలు కాలనీల్లో నిత్యావసర సరకులు పంచారు. మిగిలిన ప్రాంతాల్లో గురువారం సరుకులు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

చేనేతలకు చేయూత

100 యూనిట్ల ఉచిత విద్యుత్తు హామీ అమలు



అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం తర్వాత ఎక్కువమంది జీవనాధారం చేనేత పరిశ్రమపైనే. గత వైకాపా ప్రభుత్వం చేనేతలకు వచ్చే రాయితీ పథకాలు తొలగించి 'నేతన్న నేస్తం' పేరుతో సంవత్సరానికి రూ. 24 వేలు ఖాతాల్లో జమ చేసి చేతులు దులుపుకొంది. రాజకీయ పలుకుబడితో అనర్హులకు ఎక్కువ శాతం ఇచ్చారనే ఆరోపణలతో గతంలో చేనేత సంఘాలు ఆందోళనలు చేశాయి. ఉచిత కరెంట్ ఇస్తామన్న వైకాపా మొండిచేయి చూపింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 100 యూనిట్ల లోపు కరెంట్ బిల్లు ఉన్నవారు ఛార్జీలు చెల్లించాల్సిన పనిలేదని ప్రకటించింది. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే హామీని అమలు చేయడంపై చేనేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో చేనేత కుటుంబాలు	45,274
పనిచేస్తున్న మొత్తం మగ్గాలు	37,500
ఉచిత విద్యుత్తుకు దరఖాస్తు చేసుకున్నవారు	6,892 మంది
కరెంట్ బిల్లు రాయితీ పొందిన అర్హులు	4,892 మంది

ఎలా దరఖాస్తు చేసుకోవాలి..

చేనేత కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేసింది. వాటితోపాటు, ఆధార్‌కార్డు, 100 యూనిట్ల లోపు వచ్చిన కరెంట్ బిల్లు, చేనేత కార్మికుడిగా ఉన్న ఫొటోతో సమీపంలోని సచివాలయానికి లేదా విద్యుత్తు కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు సమర్పించాలి. దరఖాస్తు చేసిన రెండు మూడు రోజుల్లో సంబంధిత విద్యుత్తుశాఖ లైన్‌మ్యాన్ పరిశీలనకు వస్తారు. విచారించి అర్హులను గుర్తిస్తారు. 100 యూనిట్లకు లోపు ఉంటేనే ఉచిత కరెంట్ అమలు అవుతుంది. 101 యూనిట్లు వచ్చినా ఉచితం అమలు కాదు. సెప్టెంబరులో దరఖాస్తు చేసుకున్న చేనేతలకు ఇప్పుడు బిల్లులు సున్నా రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

చంద్రబాబు మాట నిలుపుకొన్నారు



- నాగార్జున, చేనేత కార్మికుడు, వడియంపేట

ఎన్నికల ముందు ఒకమాట అధికారంలోకి వచ్చాక ఒక మాట చెప్పే నాయకులను చూశాం. కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తారు. గతంలోనే చేనేతలకు సంక్షేమ పథకాలు అమలు చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఉచిత కరెంట్ అంటే నమ్మలేకపోతున్నాం. గత వైకాపా ప్రభుత్వం నెలనెలా కరెంట్ బిల్లులు పెంచుతుండేది. ప్రస్తుతం ఆర్థిక భారం తగ్గింది.

అండగా కూటమి ప్రభుత్వం



ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చటానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగాను అన్ని విధాలుగా నాశనం చేసింది. గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు ప్రతినెలా చేనేతలకు ఆదాయం సమకూర్చేలా 11 సంక్షేమ పథకాలను అమలు చేసేది. ఈసారి ఉచిత కరెంట్ ఇచ్చి మరింత భరోసా కల్పించారు.

- పోతుల లక్ష్మీనరసింహులు, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్

ఏమ్మా.. అంగన్‌వాడీ కేంద్రాలకు ఏ బియ్యం ఇస్తారు!

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఏమ్మా... అంగన్‌వాడీ కేంద్రాలకు ఎలాంటి బియ్యం సరఫరా చేస్తారో తెలుసా. బిడ్డ పుట్టగానే వ్యాక్సిన్ ఏమేం ఇస్తారో చెప్పగలవా.. అంటూ అభ్యర్థినులను అడిగారు. బుధవారం అనంత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో అనంత అర్బన్, అనంత గ్రామీణం, నార్పల, శింగనమల, తాడిపత్రి, ఉరవకొండ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. సంయుక్త కలెక్టర్ (జేసీ) శివనారాయణ శర్మ, ఆర్డీఓ వసంత్‌బాబు, ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి, ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి విజయలక్ష్మి, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, తదితరుల సమక్షంలో ఈ ఇంటర్వ్యూలు జరిగాయి. పౌష్టికాహారం, వ్యాక్సినేషన్, ఆహార సామగ్రి, పిల్లల బరువు, ఎత్తు.. వంటి అంశాలపై ప్రశ్నలు అడిగారు. నిర్దేశిత ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త, మినీ కార్యకర్త, సహాయకురాలు కేడర్లకు సంబంధించి మొత్తం 49 పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. అన్ని పోస్టులకు 161 మంది దరఖాస్తు చేసుకోగా.. 139 మంది హాజరయ్యారు. తక్కిన 22 మంది రాలేదు.


ప్రశ్నలు అడుగుతున్న జేసీ శివనారాయణ శర్మ, పీడీ శ్రీదేవి, డీఏఓ విజయలక్ష్మి, అదనపు డీఎంహెచ్‌ఓ సుజాత, ఆర్డీఓ వసంతబాబు, తదితరులు

తుంగభద్ర ఆధునికీకరణకు నిధులు మంజూరు

రాయదుర్గం, న్యూస్‌టుడే: తుంగభద్ర ఎగువ కాలవ ఆధునికీకరణ పనులకు రూ. 35 కోట్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ర.భ. అతిథి గృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. హెచ్ఎల్ఎంసీ కింద ఈ నిధులతో 11 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గంలోనే 9 పనులు ఉన్నాయన్నారు. కణేకల్లు చెరువుకు అవుట్ పాల్ గేట్లు అమర్చడం, 105వ కి.మీ. నుంచి వివిధ ప్రాంతాల్లో బలహీనంగా ఉన్న కాలవ గట్లకు మరమ్మతులు, యూటీల మరమ్మతులు తదితర పనులకు నిధులు మంజూరు చేశారన్నారు. వైకాపా పాలనలో హెచ్చెల్సీని నిర్లక్ష్యం చేయటంతో ప్రధాన కాలువ దెబ్బతిని యూటీలు పైకి లేచాయని విమర్శించారు.

ప్రభుత్వ నర్సుల సంఘానికి కొత్త కార్యవర్గం



అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలను బుధవారం ఐఎంఏ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకుని కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల్లో పోటీదారులతో గెలుపొందిన అభ్యర్థులను విజేతలుగా ఎన్నికల అధికారి చంద్రశేఖర్ ప్రకటించారు. నూతన కార్యవర్గంలో జిల్లా అధ్యక్షురాలు పద్మావతి, వైస్‌ప్రెసిడెంట్ భానులత, కార్యదర్శి లత, కోశాధికారి సంధ్య అరుణమ్మతోపాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నారాయణస్వామి, శ్రీదేవి, ఆదిత్యాదేవి, నాగమణి, అరుణలు ఉన్నారు.

అక్కాచెల్లెళ్లు.. క్రికెట్‌లో దూకుడు

జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : తండ్రి ప్రోత్సాహంతో సరదాగా బ్యాట్ పట్టిన ఆ ఇద్దరు అమ్మాయిలు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెట్‌లో రాణిస్తున్నారు. అక్కా బ్యాట్స్‌ఉమెన్‌గా, చెల్లి బ్యాట్స్‌మెన్, బౌలర్‌గా ప్రతిభ కనబరుస్తున్నారు. వారే గుంతకల్లు పట్టణంలో నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన ధనుంజయ్య, లీలా దంపతుల కుమార్తెలు అమూల్య, నందిని. వీరి విజయ గాథపై స్ఫూర్తిదాయక కథనం.

ఆర్డీటీ సహకారం

అమూల్య ఇంటర్ మొదటి సంవత్సరం, చెల్లి నందిని సరోజినీ నాయుడు పురపాలక బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. వీరికి ఆరేళ్ల కిందట బాలికలకు క్రికెట్ అంటే తెలియదు. పిల్లలు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని తల్లిదండ్రులు ప్రోత్సహించారు. క్రికెట్ బ్యాట్ పట్టి ఆడే విధానం గురించి పిల్లలకు మెలకువలు నేర్పించారు. ఆర్డీటీ సంస్థ ప్రోత్సాహంతో 2019 ఏడాది నుంచి వేసవి శిబిరాల్లో శిక్షకుల సారథ్యంలో ప్రాథమిక స్కూల్ నుంచి శిక్షణ తీసుకుంటున్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ క్రికెట్‌లో దూసుకెళ్తున్నారు.

బ్యాట్స్‌ఉమెన్, వికెట్ కీపర్‌గా అమూల్య

2019 నుంచి ఆర్డీటీ సంస్థ నిర్వహిస్తున్న వేసవి శిబిరాల్లో అమూల్య పాల్గొంటూ సత్తా చాటుతోంది. 2022లో అనంత ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌ల్లో బ్యాట్స్‌ఉమెన్, వికెట్ కీపర్‌గా రాణించింది. 2024లో నెల్లూరు జిల్లా, వెంకటగిరిలో అండర్-19 విభాగంలో సౌత్ జోన్ పోటీలు జరిగాయి. కర్నూలు జట్టుపై 51 పరుగులు, చిత్తూరు జట్టుపై 44 పరుగులు చేసి ప్రతిభ చాటింది.

● 2023-24లో అనంతపురం జిల్లాలో ఏపీఎల్ టోర్నీ జరిగింది. ఎనిమిది మ్యాచ్‌లు ఆడి మూడు అర్ధ సెంచరీలు చేసింది. రెండు రన్‌అవుట్లు, రెండు క్యాచ్‌లు, రెండు స్టంప్ అవుట్లు చేసింది. సౌత్ జోన్, జిల్లా, మండల, స్కూల్‌గేమ్స్ పోటీల్లో 65 మ్యాచ్‌ల్లో పాల్గొని మొత్తం వెయ్యి పరుగులతో దూసుకెళ్లింది.


అమూల్య నందిని

ఆల్‌రౌండర్‌గా నందిని

● నందిని అండర్-15 విభాగంలో బ్యాట్స్‌ఉమెన్, బెస్ట్ బౌలర్‌గా రాణిస్తోంది.

● 2022-23లో ఏపీఎల్ టోర్నీలో ఎనిమిది మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసి ఉత్తమ బౌలర్‌గా దూసుకెళ్లింది.

● 2023-24లో ఏపీఎల్ టోర్నీలో ఆరు మ్యాచ్‌లు ఆడి 12 వికెట్లు పడగొట్టి, ఐదు క్యాచ్‌లు పట్టింది. 272 పరుగులు సాధించింది.

● 2023-24లో గుజరాత్ రాష్ట్రంలో రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. ఒక మ్యాచ్‌లో రెండు వికెట్లు, మరో మ్యాచ్‌లో ఒక వికెట్ తీసింది. ఇప్పటి వరకు 69 మ్యాచ్‌ల్లో పాల్గొని 979 పరుగులు సాధించింది. 74 వికెట్లు తీసి ఆల్‌రౌండర్‌గా సత్తా చాటడం విశేషం.

వాలీబాల్ పోటీల్లో చిత్తూరు, గుంటూరు జట్లకు విజయం

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లిలో నిర్వహించిన 68వ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్-17 వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. బాలుర విభాగంలో చిత్తూరు జట్టు, బాలికల విభాగంలో గుంటూరు జట్లు విజేతలుగా నిలిచాయి. గెలుపొందిన జట్లకు ఎంఈఓ ఏహెచ్ గంగప్ప, హెచ్ఎం సుధామణి, టోర్నమెంట్ పరిశీలకులు రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేశ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మురార్జీయాదవ్, అతిథులు పల్లా లక్ష్మీకుమార్, బండారు బాలాజీ, పామిశెట్టిశేఖర్, మంచాల మారుతి, మంజునాథ్, ఏసీ నాగరాజు, ఓబులేసు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి రామకృష్ణ, రామాంజనేయులు, ప్రకాశ్‌రెడ్డి కప్‌లు అందించారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 26 బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో గుంటూరు, చిత్తూరు జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఉత్కంఠగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చిత్తూరు జట్టు విజేతగా నిలిచింది. గుంటూరు జట్టు ద్వితీయ, విశాఖపట్నం తృతీయ, శ్రీకాకుళం జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో చిత్తూరు, గుంటూరు జిల్లా జట్లు ఫైనల్‌కు చేరాయి. ఈ రెండు జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో గుంటూరు జట్టు విజేతగా నిలిచింది. చిత్తూరు ద్వితీయ, అనంతపురం తృతీయ, ప్రకాశం జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు అతిథులు కప్‌లు, పతకాలు అందించారు.


బాలుర విభాగంలో విజేతగా నిలిచి కప్పు అందుకుంటున్న చిత్తూరు జట్టు

పాతకక్షలతో తాడిపత్రిలో ఘర్షణ

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని గాంధీనగర్‌లో మంగళవారం రాత్రి ఇరు వర్గాలు ఘర్షణ పడ్డాయి. పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు వైకాపా వర్గీయుడు మహమ్మద్ గౌస్, తెదేపా వర్గీయుడు సాధిక్‌కు పాత కక్షలు ఉండేవని, మంగళవారం రాత్రి మహమ్మద్ గౌస్ ఓ పెళ్లికి వెళ్లి వస్తుండగా అన్నక్యాంటీన్ సమీపంలో సాధిక్ ఎదురు పడటంతో ఘర్షణ పడ్డారు. సాధిక్ స్నేహితులతో కలిసి మహమ్మద్ గౌస్‌ను కొట్టగా ఆయనకు గాయాలయ్యాయి. చికిత్స కోసం తాడిపత్రికి తరలించారు. అక్కడి నుంచి అనంతపురం పెద్దాసుపత్రికి తరలించారు.

రైతులను కబళించిన మృత్యువు

పంట విక్రయించేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

ఆ రైతు ఆరుగాలం శ్రమించాడు. కంటికి రెప్పలా కాపాడుకున్న వేరుసెనగ పంటను కోతకోయించాడు. దిగుబడి ఆశాజనకంగా రావడంతో సంబరపడ్డాడు. వరుణ దేవుడి కరుణతో ఇక తన కష్టాలన్నీ తీరాయని కొండంత ఆశతో దిగుబడిని విక్రయించేందుకు మరో రైతుతో కలిసి బయలుదేరాడు. చక్కగా కబుర్లు చెప్పుకొంటూ ద్విచక్రవాహనంలో వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన మృత్యుశకటం ఆ ఇద్దర్నీ బలితీసుకుంది. ఆ కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది.


నాగేశ్వరరెడ్డి వెంకటరమణ

శింగనమల, న్యూస్‌టుడే : శింగనమల మండలం పోతురాజుకాల్వ వద్ద బుధవారం ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు రైతులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో సోదనపల్లికి చెందిన వెంకటరమణ(52), నాగేశ్వరరెడ్డి(54) మృతి చెందారు. వెంకటరమణ వేరుసెనగ పంటను కోత కోయించి స్వగ్రామం నుంచి నార్పలకు వేరుసెనగ కాయలను ఆటోలో వేసి పంపారు. తర్వాత మిత్రుడు నాగేశ్వరరెడ్డితో కలిసి ద్విచక్రవాహనంలో ఆటో వెనకాలే బయలుదేరారు. తాడిపత్రి-అనంతపురం జాతీయ రహదారి పైకి చేరుకోగానే వెనకవైపు నుంచి టిప్పర్ వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. రైతు వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందారు. కొన ఊపిరితో ఉన్న నాగేశ్వరరెడ్డిని 108 వాహనంలో తరలిస్తుండగా మృతి చెందారు. ఈఘటనపై సీఐ కౌలుట్లయ్య, ఎస్సై శరత్‌చంద్ర కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

తుదిదశ పోటీలకు ఒడిశా జట్టు అర్హత

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ పోటీల్లో ఒడిశా జట్టు ఫైనల్ రౌండు పోటీలకు అర్హత సాధించింది. గ్రూప్-ఎఫ్‌లో ఒడిశా జట్టు అగ్రస్థానంలో నిలిచి నాకౌట్ పోటీలకు దూసుకెళ్లింది. బుధవారం అనంత క్రీడాగ్రామంలో జరిగిన చివరిరౌండ్ పోటీలో ఒడిశా జట్టు మధ్యప్రదేశ్ జట్టును 12-0 గోల్స్ తేడాతో భారీ విజయం నమోదు చేసింది. ఈ పోటీల్లో ఒడిశా జట్టు రెండు విజయాలు నమోదు చేయగా ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. పాయింట్ల ప్రకారం ఒడిశా జట్టు ఎఫ్-పూల్ నుంచి తుది రౌండ్ పోటీలకు చేరింది. ఒడిశా జట్టు ఆట ప్రథమార్థంలో ఆరు, ద్వితీయార్థంలో కూడా ఆరు గోల్స్ నమోదు చేయడం విశేషం. మధ్యప్రదేశ్ జట్టు ఒక్క గోల్ కూడా చేయలేక తేలిపోయింది. మధ్యాహ్నం జరిగిన మరో పోటీలో అరుణాచల్ ప్రదేశ్ జట్టు లద్దాఖ్ జట్టును 2-0 గోల్స్ తేడాతో పోరాడి నెగ్గింది. గత ఐదు రోజులుగా జరిగిన ఈ పోటీలు బుధవారంతో ముగిశాయి.


గోల్ కోసం తలపడిన లద్దాఖ్, అరుణాచల్ ప్రదేశ్ జట్లు

తెదేపా నాయకుడిపై వైకాపా వర్గీయుల దాడి


కాలికి గాయంతో కాటమయ్య

తాడిమర్రి, న్యూస్‌టుడే : మండలంలోని చిల్లవారిపల్లికి చెందిన తెదేపా నాయకుడు అండ్ర కాటమయ్యపై అదే గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు నారాయణరెడ్డి వర్గీయులు దాడి చేశారు. బుధవారం బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. వైకాపా హయాంలో చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రం దేవాదాయ శాఖలో నిర్వహణలో ఉండేది. స్థానిక వైకాపా నాయకులు అధికారాన్ని ఉపయోగించి ఆలయాన్ని వారిలో ఆధీనంలోకి తీసుకుని, ఛైర్మన్‌గా నారాయణరెడ్డిని నియమించారు. దీనిపై స్థానిక తెదేపా నాయకులు ఆ పార్టీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌కు దృష్టికి తీసుకెళ్లి ఆలయ ఛైర్మన్‌గా వారిని తొలగించాలని కోరారు. ఈ విషయం వైకాపా నాయకులకు తెలిసింది. మంగళవారం రాత్రి గ్రామంలో ఒంటరిగా వెళ్తున్న కాటమయ్యపై నారాయణరెడ్డి, అతని అనుచరులు మూకుమ్మడిగా దాడి చేశారు. దీంతో స్పృహ తప్పిపడిపోవడంతో బాధితుని బంధువులు వైద్య చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు పోలీసులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో నారాయణరెడ్డి, సోమిరెడ్డి, చిన్న ఓబిరెడ్డి, బాలిరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లోయలో పడిన ఆర్టీసీ బస్సు

● 20 మందికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు
● ఎదురుగా వస్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో ప్రమాదం

పులివెందుల (వేంపల్లె), కదిరి, తలుపుల : వైఎస్ఆర్ జిల్లా పులివెందుల పట్టణ సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి లోయలో పడిన ఘటనలో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరికి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు.. పులివెందుల ఆర్టీసీ డిపో అద్దె బస్సు బుధవారం ఉదయం కదిరి నుంచి పులివెందులకు వస్తోంది. పులివెందుల పట్టణ సమీపంలో కదిరి మార్గంలోని డంపింగ్ యార్డు వద్దకు రాగా, ఎదురుగా రెండు లారీలు ఒకదాన్నొకటి దాటుకునే ప్రయత్నంలో చిన్నలారీ డ్రైవరు అకస్మాత్తుగా ఆర్టీసీ బస్సుకు అడ్డొచ్చారు. ఊహించని పరిణామంతో ఆర్టీసీ డ్రైవరు గంగిరెడ్డి బస్సును అదుపు చేసేందుకు ఎడమవైపు తిప్పగా పక్కనే 40 అడుగుల లోయలో పడి పోయింది. బస్సులో 21 మంది వరకు ప్రయాణికులుండగా, అంతా పులివెందుల, శ్రీ సత్యసాయి జిల్లాకు చెందినవారే. ఘటనలో పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెకు చెందిన షేక్ సాబీరున్నీసా, కదిరికి చెందిన దాదాపీర్, గాండ్లపెంట మండలం నర్సన్నగారిపల్లెకు చెందిన కదిరి నర్సింహులు, పులివెందులకు సిరిగిరెడ్డి థామస్‌రెడ్డి, తొండూరు మండలం కృష్ణంగారిపల్లెకు చెందిన గూడూరు రామసుబ్బారెడ్డి, కదిరి మండలం మెటుకుపల్లెకు చెందిన శ్రీదేవి, బస్సు కండక్టర్ నీరదా మణితో పాటు మరో 13 మందికి గాయాలయ్యాయి. వీరిని '108' వాహనంలో పులివెందుల ఆసుపత్రికి తరలించారు. థామస్‌రెడ్డి పక్కటెముకలు విరగడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పులివెందుల ట్రాఫిక్, అర్బన్ సీఐలు హాజీ వల్లీ, గంగనాథ్‌బాబు పరిశీలించారు. గాయపడినవారిని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, తెదేపా సింహాద్రి పురం మండల బాధ్యుడు జోగిరెడ్డి, పులివెందుల పురపాలక సంఘం అధ్యక్షుడు వరప్రసాద్, తదితరులు పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాదంలో బస్సు పల్టీలు కొడుతూ వెళ్లి నేలను తాకే సమయంలో యథాస్థితికి చేరడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, బోల్తా పడి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హాజీవల్లీ తెలిపారు.


ప్రమాదంలో గాయపడిన వారిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం


పులివెందుల సమీపంలో లోయలో పడిన ఆర్టీసీ అద్దె బస్సు

ఆస్తి తగాదాలో తండ్రిని హతమార్చిన తనయుడు

యాడికి, న్యూస్‌టుడే : తండ్రి అన్న మమకారం కూడా లేకుండా తనయుడే ఆయన్ను అతి కిరాతకంగా హత మార్చిన ఘటన యాడికిలో బుధవారం జరిగింది. ఆస్తి పంపకాల విషయంలో తలెత్తిన వివాదం కాస్త హత్యకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వీరన్నపల్లి గ్రామానికి చెందిన వడ్రా లక్ష్మీనారాయణ(48)కు ఇద్దరు భార్యలు. మద్యానికి బానిసగా మారిన లక్ష్మీనారాయణ ఇద్దరు భార్యలను వదిలి తాగుతూ జులాయి తిరుగుతుండేవాడు. యాడికిలోని వెంగమనాయుడు కాలనీలో మొదటి భార్య వరలక్ష్మి, కుమారుడు కార్తిక్ నివాసం ఉంటున్నారు. లక్ష్మీనారాయణ తల్లి నారాయణమ్మ పేరు మీద ఐదెకరాల పొలం ఉంది. ఆస్తి తగాదాపై కోర్టుకు సైతం వెళ్లారు. ఆస్తి అంతా తాగుడుకే కేటాయిస్తుండటంతో పలుమార్లు కుటుంబ సభ్యులు గొడవలు పడ్డారు. ఈక్రమంలో బుధవారం కుంటకట్ట సమీపంలో తారసపడిన తండ్రితో కుమారుడు ఆస్తి విషయంలో వాదనకు దిగాడు. అదికాస్త ఘర్షణకు దారి తీసింది. అక్కడే ఉన్న రాళ్లతో దాడి చేయడంతో తండ్రి కుప్పకూలిపోయాడు. ఆ వెంటనే కుమారుడు తనతోపాటు తెచ్చుకున్న కత్తితో గొంతు కోశాడు. దీంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. అనంతరం నిందితుడు కార్తిక్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. రెండో భార్య రమాదేవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు.


ఘటనా స్థలం వద్ద పరిశీలిస్తున్న సీఐ ఈరన్న

అత్యాచారం కేసులో నిందితుడి పట్టివేత


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే : చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో ఈ నెల 11న అత్తా, కోడళ్లపై జరిగిన అత్యాచార ఘటన కేసులో నిందితుడు చాకలి శ్రీనివాసులు (20)ను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. కేసుకు సంబంధించి ఇప్పటికే ఐదుగురు నిందితులను 48 గంటల్లోనే అరెస్ట్ చేశామన్నారు. పరారీలో ఉన్న నిందితుడు చాకలి శ్రీనివాసుల కోసం హిందూపురం డీఎస్పీ కేవీ మహేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో పూలకుంట గ్రామ శివారులో ఆదిరెడ్డి పొలం వద్ద అతన్ని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసుతోపాటు హిందూపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో దోపిడీ, అక్రమ మద్యం కేసులతో పాటు అత్యాచార, దొంగతనం కేసుల్లోనూ శ్రీనివాసులు నిందితుడిగా ఉన్నాడని పేర్కొన్నారు. అత్యాచార కేసులో అరెస్ట్ అయిన నిందితుల వల్ల ఎవరైనా ప్రత్యక్షంగా అన్యాయానికి గురైన బాధితులు ముందుకొచ్చి పోలీసులకు ఫిర్యాదుచేస్తే అలాంటి వారికి తగు న్యాయం చేస్తామని ఎస్పీ తెలిపారు.

దొంగ అరెస్టు.. బంగారు నగలు స్వాధీనం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చోరీలకు పాల్పడే ఓ అంతర్‌జిల్లా దొంగను అనంతపురం గ్రామీణం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాలను సీఐ శేఖర్ మీడియాకు వెల్లడించారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన అగ్రహారం రంగస్వామి అలియాస్ రంగ అనేవ్యక్తి పగటివేళ తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలు చేయడంలో సిద్ధహస్తుడు. ఈ ఏడాది ఆగస్టులో అనంతపురం గ్రామీణంలోని సోములదొడ్డిలో ఒకేరోజు రెండిళ్లలో చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో చోరీ చేసిన నగలను బ్యాంకులో కుదువ పెట్టడానికి నగరంలోకి వస్తుండగా సీఐ శేఖర్, ఎస్సై రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ. 8 లక్షలు విలువ చేసే 125 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గుత్తి, కర్నూలు జిల్లా మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, డోన్ పోలీసుస్టేషన్లలో పలు దొంగతనాల కేసులున్నాయి. జైలుకు వెళ్లొచ్చాడు. దొంగను చాకచాక్యంగా పట్టుకున్న పోలీసులను అనంతపురం గ్రామీణం డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు.


స్వాధీనం చేసుకున్న నగలతో గ్రామీణం సీఐ శేఖర్, ఎస్సైలు

యువకుడి ఆత్మహత్య

నల్లచెరువు(కదిరి), న్యూస్‌టుడే : నల్లచెరువుకు చెందిన వెంకటేశ్ (34) బుధవారం గ్రామ సమీపాన పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మగ్బూల్‌బాషా తెలిపిన మేరకు వివరాలు. అతను మద్యం వ్యసనానికి బానిసయ్యాడు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లింది. కుమారుడి పరిస్థితిని చూసి సంసారం సక్రమంగా చేసుకోవాలని తల్లి మందలించింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన వెంకటేశ్ నల్లచెరువులోని వేమన ఆలయానికి వెనుక భాగంలో పొలంలో చెట్టుకు ఉరేసుకుని మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హీటర్ తగిలి చిన్నారి మృతి


శ్రీవల్లి

కనగానపల్లి, న్యూస్‌టుడే: నీటిని కాచే హీటర్ తగిలి చిన్నారి మృత్యువాత పడిన విషాద ఘటన కనగానపల్లి మండలం చంద్రచార్లలో బుధవారం చోటుచేసుకుంది. చంద్రచార్లకు చెందిన నాగలీల, నరసింహులు దంపతుల కుమార్తె శ్రీవల్లి(10) అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. పాఠశాలకు సమయం అవుతోందని శ్రీ వల్లికి స్నానం చేయించడానికి ఇంట్లోని స్నానపు గదిలో ఒక బకెట్లో నీటిని నింపి అందులో హీటర్‌ను చిన్నారి తల్లి నాగలీల వేసింది. తన తల్లికి చెప్పకుండా స్విచ్ ఆఫ్ చేయకుండా హీటర్‌ను తీసే క్రమంలో అనుకోకుండా చేయికి తగలి విద్యుదాఘాతానికి ఆ చిన్నారి గురైంది. ఇంటిలో వారు గమనించి వైద్యం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యమంలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

వ్యవసాయంపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంపై పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మల్లికార్జున విద్యార్థులకు సూచించారు. బుధవారం ఎన్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ విద్యార్థులు కృషి విజ్ఞాన కేంద్రంలో క్షేత్ర పర్యటన నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్తలు మల్లికార్జున, కిరీష, యుగంధర్, హరణి పలు విషయాలను తెలిపారు. వివిధ రకాల పంటలు, ఉద్యాన, పండ్ల మొక్కలు, ఆహార, తృణ ధాన్యాలు, పశు సంపదపై వివరించారు. అనంతరం కేవీకే ఆవరణలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు శేషయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ఉపాధి అక్రమాలపై సమగ్ర విచారణకు డిమాండ్

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయించాలని సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఉపాధి కార్యాలయాన్ని ముట్టడి చేసి ధర్నాకు దిగారు. తాజాగా జరిగిన సామాజిక తనిఖీలో రూ.78 లక్షలు దుర్వినియోగమైనట్టు తనిఖీ బృందం నివేదిస్తే, అధికారులు రూ.9 లక్షలు మాత్రమే తూతూమంత్రంగా రికవరీకి ఆదేశించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక ఏడాదిలోనే ఇంత పెద్ద మొత్తంలో అక్రమాలు చోటు చేసుకుంటే, మిగతా నాలుగేళ్లలో ఎన్ని జరిగుంటాయో అర్థమవుతుందని చెప్పారు. నాయకులు రంగారెడ్డి, మధుసూదన్, చెన్నరాయుడు, అబ్బాస్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న తెదేపా నాయకులు

'మాజీ ఎమ్మెల్యేకు మతిభ్రమించింది'

ఉరవకొండ, న్యూస్‌టుడే: వైకాపా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఇకనైనా ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకోవాలని మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఉద్దేశించి, మతిభ్రమించి మాట్లాడుతున్నారని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రేగటి నాగరాజు, తెదేపా మండల కన్వీనరు విజయభాస్కర్, కార్యదర్శి మోపిడి గోవిందు, పట్టణాధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు పెద్దకొట్ల రాజేశ్, నిరంజన్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని జగనన్న కాలనీలకు మంత్రి పయ్యావుల కేశవ్ పేరుపెట్టడం కోసం గ్రామ పంచాయతీ పాలక వర్గం తీర్మానం చేయడాన్ని తట్టుకోలేక ఆయన విడ్డూరంగా మాట్లాడుతున్నారన్నారు. ఆ కాలనీలకు సంబంధించిన స్థలాలను 2019లో లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో పయ్యావుల కేశవ్ కీలకంగా వ్యవహరించారన్నారు. నియోజకవర్గానికి 16 వేల ఇళ్లను మంజూరు చేయించుకొచ్చారని గుర్తు చేశారు. దీంతో అక్కడ పేదలు ఇళ్లను నిర్మించుకున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే పొంతలేనిరుగుడు మాటలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సుదర్శన్, వేణుగోడ్, ప్రసాద్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

దారులు ఛిద్రం.. రాకపోకలు నరకం



కణేకల్లు రోడ్డులో రైల్వేగేటు సమీపంలో దెబ్బతిన్న రోడ్డు

పట్టణంలో మొత్తం తారురోడ్డు	: 0.62 కి.మీ.
సిమెంట్ రోడ్డు	: 47.64 కి.మీ.
కంకర రోడ్డు	: 0.77 కి.మీ.
మట్టి రోడ్డు	: 66.55 కి.మీ.



ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారి దుస్థితి

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం పట్టణంలో రహదారులు ఛిద్రమైయ్యాయి. దీంతో గుంతల దారుల్లో రాకపోకలకు వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు గుంతల్లో చేరి పెద్దఎత్తున నిల్వ ఉన్నాయి. ఈ క్రమంలో వాహనాలు వెళ్తున్నప్పుడు ఆ నీరు పాదచారులపై పడుతూ అసౌకర్యంగా మారింది. గుంతల దారిలో ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని ప్రజలు, చోదకులు వాపోతున్నారు.

● రెండేళ్ల కిందట వైకాపా ప్రభుత్వ పాలనలో ఆ పార్టీ గుత్తేదారులు నాణ్యత లోపంతో వేసిన సిమెంట్ రోడ్లు, కల్వర్టులు కంకర తేలాయి. పట్టణంలో రెండు విడతల్లో రూ.20 లక్షలతో నామమాత్రంగా వేసిన ప్యాచ్ వర్క్సులు ఒకే వర్షానికి కొట్టుకుపోయాయి.

● పట్టణంలోని పోలీసుస్టేషన్ ముందు, వెనుక వైపున, ఆత్మకూరు వీధి, తహసీల్దార్, నేతాజీ, ఓబుళాపురం, 4వ వార్డులోని కొలిమి వీధి, మీసేవా తదితర ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. కణేకల్లు రోడ్డులో చిన్న వర్షం పడ్డినా రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

● సెయింట్ పాల్ పాఠశాల వద్ద బురదలో పడుతూ లేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. ఇక శివారు కాలనీల్లో సమస్యలు జటిలంగా మారాయి. ఇళ్ల ముందే మట్టిరోడ్ల మధ్య మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునే వారే కరవయ్యారు.

● సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

మరమ్మతులకు చర్యలు

పట్టణంలో అధ్వానంగా ఉన్న రోడ్లను గుర్తించాం. 95 ప్యాచ్ వర్క్సులను మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల అనుమతితో రూ.6 లక్షలతో మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. కల్వర్టుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

సమస్యలతో సతమతమవుతున్నారా!

రాయదుర్గం మున్సిపాలిటీలో తాగునీరు సరిగా సరఫరా కావడం లేదా? వీధి దీపాలు వెలగడం లేదా? మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదా? వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోతుందా. తాగునీటి పైపులైన్ లీకవుతుందా? కుక్కలు, పందుల బెడద అధికంగా ఉందా? శివారు కాలనీల సమస్యలు పట్టించుకోవడం లేదా? ఇలాంటి సమస్యలతో సతమతమవుతున్నారా? వీటి పరిష్కారానికి 'ఈనాడు - మేమున్నాం.. మీకు తోడుగా' వేదికగా కమిషనర్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు తెలుపండి. అవి పరిష్కారమయ్యేలా చూస్తాం. ఇంకెందుకు ఆలస్యం. వెంటనే ఫోన్ చేసి సమస్య వివరించండి.

తేదీ: 25.10.2024 (శుక్రవారం)
సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ✆ 98499 05858

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: పట్టణంలోని ముత్తరాసి కాలనీలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. **- కోదండరాముడు**

సమాధానం: వెంటనే మరమ్మతులు చేపడతాం. **- బాలచంద్ర, ఏఈ, విద్యుత్తుశాఖ**

సమస్య: పట్టణంలోని నేసేపేటలో కల్వర్టు అధ్వానంగా ఉంది. **- లోకేశ్**

సమాధానం: నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. **- దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్**

సమస్య: పట్టణంలోని ఉట్ల కుంటపై ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో ఇబ్బందిగా ఉంది. **- ధనార్జున**

సమాధానం: వెంటనే ముళ్లపొదలను తొలగిస్తాం. **- శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: కంబదూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద మురుగు ఏరులై పారుతోంది. **- స్థానికులు**

సమస్య: స్థానిక పెద్ద కాలనీలోకి వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక వద్ద మురుగు చేరి అధ్వానంగా ఉంది. **- స్థానికులు**

సమాధానం: వెంటనే మరమ్మతులు చేసి శుభ్రం చేయిస్తాం. **(పై రెండు సమస్యలకు పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర సమాధానం తెలిపారు.)**

– న్యూస్‌టుడే, రాయదుర్గం, కంబదూరు



కళ్యాణదుర్గం గ్రామీణం: దేవతా ప్రతిమల ఊరేగింపు



రాయదుర్గం గ్రామీణం: చదం గొల్లలదొడ్డిలో..

ఘనంగా ఆవులదేవర వేడుకలు

కళ్యాణదుర్గం గ్రామీణం, రాయదుర్గం గ్రామీణం: కళ్యాణదుర్గం మండలంలోని దొడగట్టలో బుధవారం ఆవులదేవర వేడుకలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి, రేణుక ఎల్లమ్మ సతీసమేతంగా ప్రతిమలను పురవీధుల్లో ఊరేగించారు. గ్రామ శివారులో ఏర్పాటు చేసిన గూడులో స్వామివారి ప్రతిమలను ఉంచి పూజలు చేపట్టారు. అనంతరం మూగజీవాలను గూడు చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. రాయదుర్గం మండలంలోని చదం గొల్లలదొడ్డిలో ఎర్రినాగముత్తస్వామి, వీరన్నస్వామి, ఎల్లమ్మ దేవతలను గంగపూజ చేసి పూజలు చేశారు.

నేడు బీటీపీ జలాలకు హారతి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం ప్రాంతం జీవనాడి బీటీపీ ప్రాజెక్టుకు వర్షపునీరు సమృద్ధిగా చేరడంతో జలకళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతంలో భారీగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. గురువారం బీటీపీ వద్ద కళ్యాణదుర్గం, రాయదుర్గం ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, కాలవ శ్రీనివాసులు జలహారతి ఇవ్వనున్నట్లు తెదేపా నాయకులు తెలిపారు.

గుమ్మఘట్ట: బీటీపీకి పూర్తి స్థాయిలో నీరు చేరుతుండటంతో రాయదుర్గం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబులు గురువారం గంగపూజ నిర్వహిస్తున్నట్లు క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న తెలిపారు. బీటీ ప్రాజెక్టుకు సంబంధించిన కుడి కాలువ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో, ఎడమ కాలువ రాయదుర్గం నియోజకవర్గంలో ఉండటంతో ఎమ్మెల్యేలు గంగపూజకు హాజరవుతున్నట్లు వివరించారు.

దళితుల సమస్యలపై చొరవ చూపండి

ఉరవకొండ: దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడును ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్డీ ప్రకాశ్, ఉపాధ్యక్షుడు రాజు కోరారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులను కలిశారు. దళితులపై దాడులు పునరావృతం అవుతున్నాయన్నారు. దళిత మహిళలపై అత్యాచారాలు చోటు చేసుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. దీని కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వాటికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు లక్ష్మీనారాయణ, శీను, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కేశవ్‌తో ఎమ్మార్పీఎస్ నాయకులు

తాగునీటి కోసం పైపులైను

కంబదూరు: మండలంలోని మరిమాకులపల్లిలో కొన్నేళ్ల నుంచి తాగునీటి కొరత ఏర్పడింది. దీంతో ఈనెల 2వ తేదీన 'ఈనాడు' దినపత్రికలో 'ఎడ్లబండి, ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్తున్న తాగునీరు' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జార్జ్ విల్సన్ తాగునీటి పైపుల కోసం కొలతలు తీశారు. ఎస్సీ కాలనీ, అల్లీపీరా గుడి నుంచి గ్రామ సమీపంలోని నీటి ట్యాంకు వరకు భూగర్భ తాగునీటి పైపులైను వేయనున్నట్లు తెలిపారు. మూడ్రోజుల్లో పనులు పూర్తి చేయనున్నట్లు వివరించారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

గోవిందయ్యదొడ్డి (బ్రహ్మసముద్రం): మండలంలోని గోవిందయ్యదొడ్డిలో బుధవారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలతో ప్రత్యేకాలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం వాల్మీకి ప్రతిమను వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. నాయకులు గోళ్ల వెంకటేష్, డీ.ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలోనూ సభ్యత్వాలు

శెట్టూరు: శెట్టూరు మండలంలో ఏపీ ఉపాధ్యాయ సంఘం నాయకులు బుధవారం కనుకూరు, ముచ్చర్లపల్లి పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు ఆ సంఘం జిల్లాధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. మండలంలోని ప్రతి పాఠశాలలోనూ సభ్యత్వాలను నమోదు చేస్తామన్నారు. జీవో నెం 117 రద్దు, పెండింగ్ బకాయిలు మంజూరు, 12వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

జీవాల్లో వ్యాధుల నివారణపై దృష్టి

ఉరవకొండ: ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో పాటు వాతావరణంలో మార్పుల వల్ల జీవాల్లో వివిధ రకాల కాలానుగుణ వ్యాధులు ప్రబలే అవకాశముందని పశుసంవర్ధక శాఖ ఉరవకొండ డివిజన్ ఏడీ డా.వెంకటేశ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో జీవాలకు డీ వార్మింగ్ టీకాలను ఉచితంగా వేశారు. సిబ్బందితో తమ జీవాలకు టీకాలను వేయించుకోవాలని పెంపకందారులకు సూచించారు. ఏడీ పెద్దన్న, పశువైద్యాధికారిణి శ్రీవిద్య పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని పంచాయతీ కార్యదర్శి గోవిందు తెలిపారు. బుధవారం మండలంలోని మల్లిపల్లిలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఆయా ప్రాంతాల్లో వృథా ఆయిల్, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. మాజీ సర్పంచి చిక్కన్న, కృష్ణమూర్తి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి తోడ్పాటు

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని 50 పడకల ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి రెన్యూ పవన విద్యుత్పత్తి సంస్థ తోడ్పాటును అందించింది. ఆ సంస్థ అధికారులు బుధవారం ఆసుపత్రి ప్రాంగణంలో ఐదు చోట్ల సౌర విద్యుత్తు దీపాలు, రోగుల కోసం 30 ఇనుప కుర్చీలను ఏర్పాటు చేయించారు. వీటి కోసం దాదాపు రూ.2 లక్షలు ఖర్చు పెట్టినట్లు వారు తెలిపారు. వైద్యాధికారులు డా.ఎల్లోజి, డా.వెంకటస్వామి చౌదరిలకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని వైద్యాధికారులు అభినందించారు.

బదిలీ ఉపాధ్యాయినికి సన్మానం

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్పి మండలం అండేపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పని చేస్తూ, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయిని అస్మత్‌బేగంను బుధవారం పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

వివాహిత ఆత్మహత్య

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద నివాసముంటున్న రేవతి (24) అనే వివాహిత బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా.. తమిళనాడులోని మధురై జిల్లా ఉసిలంపట్టి గ్రామానికి చెందిన మురళి, రేవతిలు రెండున్నరేళ్ల కిందట కళ్యాణదుర్గానికి వచ్చారు. చిరుతిండ్లు తయారు చేసి హోల్‌సేల్ విక్రయాలు చేస్తూ జీవనం సాగించేవారు. వీరిమధ్య తరచూ చిన్నపాటి గొడవలు జరిగేవని, ఇంట్లో ఎవరూలేని సమయంలో రేవతి చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు దిరేంద్ర (3), కుమార్తె ప్రయాంకి నెలన్నర చిన్నారి ఉన్నారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జూదరుల అరెస్టు

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలం కరిడిపల్లిలో జూద స్థావరంపై బుధవారం దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాంభూపాల్ తెలిపారు. వారి నుంచి రూ.70,170 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు చరవాణులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

గోదాము యజమానితో వాగ్వాదం

బెళుగుప్ప, న్యూస్‌టుడే: బ్యాంకు రుణం చెల్లించి పప్పుసెనగలు తీసుకెళ్లాని గోదాము యజమాని సూచించటంతో.. ఎందుకు కట్టాలని మహిళ రైతు వాగ్వాదానికి దిగిన ఘటన తగ్గుపర్తిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కృష్ణమనాయుడు, నరసమ్మ దంపతులు గ్రామ సమీపంలోని ఓ గోదాములో 200 క్వింటాళ్ల పప్పుసెనగను నిల్వ ఉంచారు. బుధవారం నరసమ్మ గోదాము వద్దకు వెళ్లింది. 16 నెలల కిందట బళ్లారి బ్యాంకులో తన భర్త రూ.5 లక్షలు రుణం తీసుకున్నాడని, ఆ రుణాన్ని చెల్లించి తీసుకెళ్లాలని గోదాము యజమాని తెలిపారు. తన భర్తతో సంతకాలు చేయించుకుని ఆ సొమ్ము వారే తీసుకున్నారని ఆమె ఆరోపించారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



ఉరవకొండ మండలంలోని పెన్నహోబిలంలో శ్రీవారి ఆలయ పరిసరాల్లో భక్తుల సదుపాయార్థం రెండేళ్ల కిందట రెండు చోట్ల మరుగుదొడ్లను నిర్మించారు. రూ.లక్షలు పెట్టి నిర్మించినా ఒక్కరోజు కూడా భక్తులకు ఉపయోగపడింది లేదు. ఎప్పుడు చూసినా తాళాలు వేసి ఉంటారు. దీంతో పిచ్చిమొక్కలు పెరిగి, ఆ ప్రాంతంలో బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది. దీనిని ఆలయ ఈవో రమేశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

బీటీపీకి వరద తాకిడి



6వ గేట్ ద్వారా నీటి విడుదల

గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: భైరవానితిప్ప ప్రాజెక్టుకు వరద తాకిడి తీవ్రం కావడంతో మంగళవారం అర్ధరాత్రి ప్రాజెక్టు 6వ నంబరు గేటును ఎత్తి నీటిని హగరికి విడుదల చేశారు. గత వారం నుంచి కర్ణాటకలో కురుస్తున్న వర్షానికి ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1655 అడుగులు కాగా ప్రస్తుతం 1654.2 అడుగులకు నీటిమట్టం చేరింది. ప్రతి గంటకు ఒక పాయింట్ ప్రకారంగా నీటి మట్టం పెరుగుతుండటంతో దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టుకు పైభాగంలోని కర్ణాటక ప్రాంతం నీరు ప్రాజెక్టుకు చేరుతోందని ఇంకా ఐదురోజుల పాటు ప్రవాహం ఉంటుందని అధికారులు తెలియజేశారు. బుధవారం యధావిధిగా దాదాపుగా 1760 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ప్రాజెక్టుకు కొనసాగుతున్నాయి. రెండ్రోజుల్లో ప్రాజెక్టు పూర్తి స్థాయి 1655 అడుగులు చేరుకుంటుందని, నీటిని దిగువకు విడుదల చేయడమా, లేదా చెరువులకు మళ్లించడమా అనే విషయంను ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు వివరించారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: మారుతున్న సాంకేతికతను వినియోగించుకుని సైబర్ నేరగాళ్లు మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని కూడేరు సీఐ శివరాముడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కేజీబీవీలో పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పరిచయం లేని, గుర్తుతెలియని వ్యక్తులు నెంబర్ గాని, చరవాణుల్లో గాని వివరాలను అడిగితే తెలియజేయరాదన్నారు. సమస్య ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని వివరించారు.

సేద్య పరికరాల మంజూరుపై దృష్టి

ఉరవకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించే విత్తు, ఎరువులతోపాటు సేద్య పరికరాల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఆ కంపెనీల డీలర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే వీటి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు సంబంధించి డీడీ సేకరణను వేగవంతం చేయాలన్నారు. డివిజన్ ఉద్యాన అధికారి నెట్టికంటయ్య పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

ఉరవకొండ, న్యూస్‌టుడే: డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు విద్యా వసతి దీవెన బకాయిలు విడుదల కాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చందు, నియోజకవర్గ అధ్యక్షుడు హరూన్ రషీద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఉప తహసీల్దార్ బోగనగౌడ్‌కు వినతిపత్రం అందించారు.

రాయదుర్గం పట్టణం: విద్యా, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం విద్యార్థులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నాగరాజుకు అందించారు.

కళ్యాణదుర్గం: బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌ఛార్జి ఆర్డీవో వినూత్నకు అందజేశారు.



అదుపుతప్పితే ప్రమాదమే

ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్డుపైకి మట్టి చేరి వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కళ్యాణదుర్గం గ్రామీణం మండలంలోని శెట్టూరు రోడ్డులోని డంపింగ్ యార్డు వద్ద రహదారిపై పెద్ద ఎత్తున మట్టి చేరి ప్రమాదకరంగా మారింది. పలుసార్లు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కిందపడి పలువురు గాయపడిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టిని తొలగించాలని ప్రజలు, చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**

చెరువు గట్టుకు మరమ్మతులు

డి.హీరేహాళ్ (రాయదుర్గం పట్టణం), న్యూస్‌టుడే: తెగిపోయిన చెరువు గట్టు మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని సోమలాపురం గ్రామ పరిధిలోని గంగమ్మ చెరువు గట్టు తెగిపోవడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులను తహసీల్దార్ పరిశీలించి, ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున నీరు వృథా కాకుండా వెంటనే అడ్డుకట్ట వేయాలని అధికారులకు సూచించారు.



రాయదుర్గం పట్టణం: పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ అనిల్‌కుమార్

కళ్యాణదుర్గం గ్రామీణం: మండలంలోని ముద్దినాయనపల్లి చెరువు కట్ట బీటలు బారి, ఓ వైపు కుంగిపోయింది. దీనిపై బుధవారం 'ఈనాడు'లో కథనం వెలువడింది. స్పందించిన ఎమ్మెల్యే సురేంద్రబాబు సంబంధిత అధికారులతో చర్చించారు. వెంటనే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకున్నారు. జలవనరుల శాఖ జేఈ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు.

ఎత్తు వేస్తే.. ప్రత్యర్థి చిత్తే



చెస్ సాధన చేస్తున్న సాయిఫణీంద్ర

ఉరవకొండ, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం హావళిగికి చెందిన సాయిఫణీంద్ర చదరంగంలో చక్కటి ప్రతిభ చూపుతూ పతకాలు, ప్రశంసలు అందుకుంటున్నారు. ఉరవకొండ మహాత్మా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్) తృతీయ సంవత్సరం చదువుతున్నారు. తండ్రి సుధాకర్ తెలుగు పండితులు. తల్లి ఉమా గృహిణి. ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడు పలు చదరంగం పోటీల్లో పాల్గొని పురస్కారం పొందారు. 2021లో చెన్నై ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్టీయూ తరఫున పాల్గొని ప్రతిభ చాటారు. 2022లో ఎస్కేయూ తరఫున 8 ఆటల్లో 5 గెలిచి ప్రశంసలు అందుకున్నారు. 2023లో అనంతపురం, పొట్టిశ్రీరాములు నెల్లూరులో జరిగిన ఓపెన్ టేలెంట్ పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్నారు. ఈ ఏడాది జనవరిలో ఎస్కేయూ తరఫున తమిళనాడులోని తిరుచానపల్లి భారతిదాసన్ విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్వర్సిటీ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ చాటారు. గత సెప్టెంబరులో ఫిడే ఆన్‌లైన్ చదరంగంలో జరిగిన అంతర్జాతీయ రేటింగ్ పోటీల్లో 1500 విభాగంలో మొదటి స్థానంలో నిలిచి రూ.10వేల నగదు బహుమతి అందుకున్నారు. ఈనెల 5, 6వ తేదీల్లో కర్ణాటకలోని దావణగెరెలో జరిగిన పోటీల్లోనూ ఉత్తమ ఆటతీరుతో ప్రశంసాపత్రం, బహుమతి అందుకున్నారు. భవిష్యత్తులో గ్రాండ్ మాస్టర్‌గా నిలవాలన్నదే తన లక్ష్యమని చెప్పారు.

సీపీఎం మండల కమిటీ ఎన్నిక

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ సీపీఎం నూతన కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పేర్కొన్నారు. పార్టీ ప్రాంతీయ కార్యదర్శిగా మండలంలోని నెరమెట్లకు చెందిన రంగారెడ్డి, మండల కమిటీ కార్యనిర్వహణ కార్యదర్శిగా మోపిడికి చెందిన మధుసూదన్, కమిటీ సభ్యులుగా మురళీ, రవికుమార్, రామాంజనేయులు నాయక్, శ్రీనివాసులు, సిద్ధప్ప, వీరాంజనేయులు ఎన్నికయ్యారు. పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలపై ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని కొత్త కమిటీ పేర్కొంది.



బొమ్మనహాళ్: నేలవాలిన మొక్కజొన్న పంట



బొమ్మనహాళ్: ఉద్దేహాళ్ వద్ద ప్రవహిస్తున్న వేదవతి హగరి



కణేకల్లు: దెబ్బతిన్న కర్బూజ పంట

వర్షం.. అపార నష్టం


లక్షలాది రూపాయలు వ్యయం చేసి సాగు చేసిన పంటలు తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్నాయి. రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో వర్షాలకు పంటలు నేలవాలాయి. ఉద్యాన పంటలు ద్రాక్ష, కళింగర, కర్బూజ దెబ్బతిని రైతులకు అపార నష్టం వాటిలింది. పంట చేతికందే సమయంలో వర్షాలు కురిసి తీవ్రంగా నష్టపోవాల్సిన దుస్థితి నెలకొందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మట్టి దారులు కోతకు గురయ్యాయి. **- న్యూస్‌టుడే, బృందం**



బెళుగుప్ప: దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న రైతులు

గుంతకల్లు
•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే



సీఎం చంద్రబాబుతో జితేంద్రగౌడు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ బుధవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబునాయుడిని కలిశారు. సచివాలయంలో సీఎంను మాజీ ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను వివరించినట్లు స్థానిక తెదేపా నాయకులు పేర్కొన్నారు.

ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుకలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు పట్టణంలో బుధవారం రెబల్‌స్టార్ ప్రభాస్ జన్మదినం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాల్మీకి రాము పట్టణంలో అనాథాశ్రమంలో పిల్లల మధ్య వేడుకలను నిర్వహించారు. కేకు కోసి అన్నదానం నిర్వహించారు.



కేకు కోస్తున్న అభిమానులు

గొడవలకు దిగితే కఠిన చర్యలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు పేర్కొన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలైన వీరాపురం, వెలమకూరులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవించాలని తెలిపారు. ఆయన వెంట సీఐ శివగంగాధర్‌రెడ్డి, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు పట్టణంలో మట్కా రాస్తున్న రామచంద్రప్ప అనే వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి రూ.25వేల నగదు, మట్కా చీటిలను స్వాధీనం చేసుకున్నట్లు ఒకటో పట్టణ హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరావు పేర్కొన్నారు. భాగ్యనగర్‌కు చెందిన ఈతను మట్కా రాస్తున్నట్లు సమాచారం రావడంతో సీఐ మనోహర్ ఆధ్వర్యంలో బళ్లారి రోడ్డు హనుమాన్ సర్కిల్‌లో దాడులు చేసి బీటరును పట్టుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.

యల్లనూరు(పుట్లూరు), న్యూస్‌టుడే: యల్లనూరు మండలంలోని పలువురు మట్కా నిర్వాహకులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాంప్రసాద్ పేర్కొన్నారు. కొడవండ్లపల్లి గ్రామంలో మట్కా రాస్తున్న తిరుపతినాయుడు, మరో వ్యక్తి నుంచి రూ. 2లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అసాంఘిక చర్యలకు పాల్పడే వ్యక్తులకు కఠిన శిక్షలు తప్పవన్నారు. నిందితులను అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్యబాబు, ఎస్ఐ రాంప్రసాద్ వివరించారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల జప్తు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి పట్టణ పరిసరాల్లోని పెన్నానదిలో నుంచి అక్రమంగా ఇసుకను తరలించే ట్రాక్టర్లను జప్తు చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం బుగ్గ రోడ్డులో తనిఖీలు చేపట్టగా ఆరు ట్రాక్టర్లను గుర్తించామని, డ్రైవర్లపై కూడా కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

వృద్ధురాలికి గాయాలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని అంబేడ్కర్ కూడలిలో బుధవారం ఓ వృద్ధురాలిని ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు బస్టాండులో యాచిస్తూ జీవనం సాగించే గుర్తు తెలియని వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీ కొనిందని తెలిపారు. ఆమె తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ నుంచి అనంతపురం పెద్దాసుపత్రికి తీసుకెళ్లారు.

పేలిన విద్యుత్తు నియంత్రిక

నార్పల, న్యూస్‌టుడే: నార్పల మండల కేంద్రంలో ఏర్పాటైన విద్యుత్తు ఉపకేంద్రంలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్తు నియంత్రిక ఒక్కసారిగా పేలిపోయింది. చుట్టుపక్కల నివాసముంటున్న ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్తు సిబ్బందికి ఎవరికీ గాయాలు కాకపోవడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం సిబ్బంది నియంత్రికకు మరమ్మతులు చేపట్టారు.

భూ సమస్యలపై వినతుల స్వీకరణ


గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: కనంపల్లి, శిరివరం గ్రామాల్లో తహసీల్దార్ ఈరమ్మ, రీసర్వే ఉప తహసీల్దార్ దివాకర్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ రీసర్వేలో సమస్యలను పరిష్కరించడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని, రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వయం ఉపాధి కాంతులు

- బ్యాంకు రుణాలతో వ్యాపారాలు
- కుటుంబాలకు ఆసరాగా నిలిచిన నారీమణులు



సమావేశమైన సంఘం సభ్యులు



బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రోటరీపురం గ్రామంలో డ్వాక్రా సంఘాల నిర్వహణలో మహిళలు సత్తా చాటుతున్నారు. ఈ గ్రామైఖ్య సంఘం రాష్ట్రంలోనే ఏడాదికి రూ.కోటి లావాదేవీలు చేస్తూ చరిత్ర సృష్టించింది. కొర్రపాడు గ్రామ పంచాయతీలోని రోటరీపురంలో దాదాపుగా 600 కుటుంబాలు ఉన్నాయి. 1998లో డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేశారు. శ్రీ చైతన్య గ్రామైఖ్య సంఘం పరిధిలోని 20 సంఘాల్లో 205 మంది సభ్యులున్నారు. వీరంతా పొదుపు బాట పట్టి ఆర్థికస్వావలంబన దిశగా సాగుతున్నారు. యానిమేటర్ నారాయణస్వామి సహకారంతో గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, సంఘం సభ్యులు బ్యాంకు లింకేజీ, శ్రీనిధి ద్వారా రుణాలు తీసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. రుణాలు తీసుకున్న మహిళలు మిక్చర్ బట్టీలు, చీరల వ్యాపారం, దుకాణాలు, హోటళ్ల నిర్వహణతో స్వయం ఉపాధి బాట పట్టారు.

ఉన్నతంగా పిల్లల చదువులు

వ్యాపారంలో వచ్చిన లాభాలతో సభ్యులు పిల్లలను హైదరాబాద్, బెంగళూరు లాంటి మహానగరాల్లో ఉన్నత చదువులు చదివిస్తూ బంగారు బాటలు వేస్తున్నారు. ఇది వరకు ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో గిరిజన మహిళలకు డ్వాక్రా సంఘాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ సంఘంగా గురించి 2017-18 సంవత్సరంలో జాతీయ పురస్కారం సైతం అందుకున్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం



గ్రామంలోని మహిళలంతా ఉపాధి కోసం అనంతపురం, బెంగళూరు, హైదరాబాద్ వెళ్లేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. పిల్లల్ని ఉన్నతంగా చదివిస్తున్నాం. సభ్యులందరూ వ్యాపారాలు చేస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా రాణిస్తున్నారు.

- భాగ్యలక్ష్మి, సంఘం అధ్యక్షురాలు

వేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: నార్పల మేజర్ పంచాయతీలో సుల్తాన్‌పేట కాలనీలో వీధి దీపాలు లేవు. **- శివ, నార్పల**
సమాధానం: పంచాయతీ అధికారి, సర్పంచితో దీపాలు ఏర్పాటు చేస్తాం. **- శైలజా,ఈవోఇర్డీ**
సమస్య: గార్లదిన్నెలో ప్రధాన రహదారి పక్కన ఉన్న సీసీరోడ్డుపై ఇళ్లనుంచి వచ్చే మురుగుతో ఇబ్బందులు పడుతున్నాం. **- కాలనీ ప్రజలు**
సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. **- చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి**
సమస్య: మర్తాడులో మట్టిరోడ్డు గుంతలమయంగా మారింది. **- మర్తాడు వాసులు**
సమాధానం: త్వరలోనే పనులు చేపడతాం. **- శ్రీనివాసులు, మండల ఇంజినీరు**
– న్యూస్‌టుడే, గార్లదిన్నె

సమస్య: తాడిపత్రిలోని సంజీవనగర్ ఆఖరి వీధులు సీసీ దారులకు నోచుకోలేదు. **- రాముడు, స్థానికుడు**
సమాధానం: తాడిపత్రిలోని శివారు కాలనీలో మట్టిరోడ్లను సీసీరోడ్లుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. **- తేజ, మున్సిపల్ ఏఈ**
– న్యూస్‌టుడే, తాడిపత్రి

సమస్య: గుంతకల్లులోని రోటరీ స్కూల్‌కు వెళ్లే దారిలో ఉలిగమ్మదేవి ఆలయం రోడ్డు పక్కన చెత్తను తొలగించడం లేదు. **- రాజు, వాహన చోదకుడు**
సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. **-ఇంద్రసేనరెడ్డి, అడ్మిన్ ఇన్‌ఛార్జీ, 20వ సచివాలయం**
– న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

పుల్లేటి వంతెన నిర్మాణానికి భూమి పూజ



వంతెన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. వీరన్నపల్లి సమీపంలో ఉన్న పుల్లేటి వాగు వంతెన నిర్మాణానికి ప్రభుత్వం ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.16.75కోట్లు మంజూరు చేయడంతో వాటి నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేయడానికి వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. తెదేపా నాయకులు క్లాస్-1 కాంట్రాక్టర్ హరినాథరెడ్డి, కొండూరు కేశవరెడ్డి, దివాకరరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, గంగరాజు, పరమేశ్వరరెడ్డి, ఈవోఆర్డీ నరసింహారెడ్డి, ఏపీవో పుల్లారెడ్డి, సీఐ రామసుబ్బయ్య, ఎస్సై ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు జేసీ నివాళి



అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న జేసీ

తాడిపత్రి, న్యూస్‌టుడే: అమరవీరుల దినోత్సవం సందర్భంగా తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి బుధవారం అనంతపురంలోని అమరవీరుల స్మారక స్తూపం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జేసీ దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల సేవలను గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.



పచ్చందాలకు రంగుల సోయగం

తాడిపత్రిలోని పురపాలిక కార్యాలయంలో పచ్చదనం పరుచుకుంది. పురపాలక ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి గతంలో భారీగా పూల మొక్కలు నాటారు. ఉద్యావనాన్ని కూడా ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వచ్చిన ఎర్రైనా కాసేపు సేద తీరుతామనే అనుకుంటారు. ప్రస్తుతం పూల మొక్కలన్నీ రంగు రంగుల పూలతో కళకళలాడుతున్నాయి.

-న్యూస్‌టుడే, తాడిపత్రి

చెరువు పటిష్ఠతపై ఆర్డీవో ఆరా



అప్పేచెర్లలోని పెద్దచెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున చెరువుల పటిష్ఠత, భద్రతపై గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసులు ఆరాతీశారు. పెద్దవడుగూరు మండలంలోని అప్పేచెర్ల సమీపంలో ఉన్న పెద్దచెరువు, చిన్నచెరువును బుధవారం ఆయనతోపాటు తహసీల్దారు ఉషారాణి, చిన్ననీటిపారుదలశాఖ ఎఈ నూర్జహాన్, ఆర్ఐ లహరిక, వీఆర్వో రామేశ్వరరెడ్డి, తదితరులు పరిశీలించారు. చెరువులో పెరిగిన కంపచెట్లను తొలగించేలా చూడాలని చిన్ననీటిపారుదలశాఖ అధికారులకు ఆయన తెలియజేశారు. అనంతరం ఆయన తహసీల్దారు కార్యాలయంలో పలు దస్త్రాలను పరిశీలించి రెవెన్యూ సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు.

వేధింపులపై ఫిర్యాదు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తికి చెందిన కుమార్ అనే యువకుడు తనను వేధిస్తున్నట్లు ఓ యువతి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొంతకాలంగా తనను శారీరకంగా, మానసికంగా వేస్తున్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. సీఐ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: నాగసముద్రం గ్రామానికి చెందిన ఎనుముల హరిశ్చంద్ర అనే రైతు చెందిన వృషభం విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఉదయం పొలం పనులకు వెళ్తున్న సమయంలో తెగిపడిన తీగను తలిగి మృతిచెందిందని బాధితుడు తెలిపారు. తనకు సాయం చేయాలని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

యువకుడికి గాయాలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: జంతులూరు గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అరుణ్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెలితే జంతులూరు గ్రామానికి చెందిన నాగముని కుమారుడు అరుణ్ బుధవారం ద్విచక్రవాహనంలో అనంతపురానికి బయలు దేరాడు. అమరావతి ఆరు వరుసల రహదారి వద్దకు రాగానే మలుపు వద్ద ఇసుక లోడుతో వస్తున్న టిప్పర్ వేగంగా ఢీకొట్టింది. అరుణ్ తలకు బలమైన గాయాలయ్యాయి.

తడిసిన పంటల పరిశీలన

గుత్తి గ్రామీణం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కోతకు వచ్చిన పంటలు తడవకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని రేకులకుంట పరిశోధన శాస్త్రవేతలు లక్ష్మణ్ పేర్కొన్నారు. మండలంలోని బాచుపల్లి, వన్నెదొడ్డి, కరిటికొండ గ్రామాల్లో బుధవారం సాయంత్రం వేరుసెనగ, కంది పంట పరిశీలించారు.

పత్తికి తెగుళ్ల బెడద

పెద్దవడుగూరు: ప్రస్తుతం పత్తి పంటను తీవ్ర నష్టాలకు గురిచేసే గులాబీరంగు పురుగు ఉధృతి నుంచి పంటను కాపాడుకునేలా రైతులు జాగ్రత్తలు పాటించాలని రేకులకుంట పరిశోధన స్థానం శాస్త్రవేత్త లక్ష్మణ్ సూచించారు. పెద్దవడుగూరులోని పలు ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన పత్తిపంటను బుధవారం ఆయనతో పాటు మండల వ్యవసాయాధికారిణి మల్లీశ్వరి, గ్రామ వ్యవసాయాధికారిణి జయలక్ష్మీ పరిశీలించారు.



ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

నిధుల దుర్వినియోగంపై విచారణకు డిమాండ్

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని నెలగొండ గ్రామంలో వైకాపా ప్రభుత్వ హయంలో 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రజాప్రతినిధులు, అధికారులు దుర్వినియోగం చేశారని, విచారణ చేసి చర్యలు తీసుకోవలని సీపీఎం నాయకులు ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరికి బుధవారం కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం నాయకులు మారుతీ ప్రసాద్, రమేష్, నాగరాజు, సురేంద్ర పాల్గొన్నారు.



విజ్ఞాన సాధన

'**ఈ**నాడు' ఆధ్వర్యంలో తాడిపత్రిలోని కస్తూర్బా గాంధీ మైనార్టీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా అంతర్జాలంతో కలిగే లాభనష్టాలు, సామాజిక మాధ్యమాలు- విద్యార్థులపై ప్రభావం అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన రాజేశ్వరి, సరియా, హాజితాలకు పాఠశాల ప్రత్యేకాధికారిణి పద్మావతి, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

-న్యూస్‌టుడే, తాడిపత్రి



యువకుల రక్తదానం

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: పెద్దపప్పూరులోని బస్టాండ్ ఆవరణలో బుధవారం జైభీమ్ పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 23 మంది యువకులు రక్తదానం చేశారు. హిందూపురం ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది సాయితేజ, హీరా, వీరాంజినేయులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో మోస్తరు వర్షం

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: తాడిపత్రి పట్టణంలో బుధవారం ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. అర గంట పాటు కురిసిన వర్షంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు వర్షంతో ఉపశమనం లభించింది.

స్వచ్ఛత ఇదేనా?



పామిడిలోని అల్లీపీరా గార్డెన్స్ పక్కన ఉన్న మదీనా ఏరియా-2 సచివాలయ ప్రాంగణంలో గడ్డి మొక్కలు పెరిగాయి. సచివాలయ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. విషపురుగుల బెడద ఎక్కువగా ఉంది. స్వచ్ఛత పాటించి ఆదర్శంగా ఉండాల్సిన కార్యాలయమే అధ్వానంగా ఉందని జనం విమర్శిస్తున్నారు. -న్యూస్‌టుడే, పామిడి

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



పీడీ వెంకటేష్‌తో ఎంపికైన విద్యార్థులు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : గార్లదిన్నెలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు అండర్-14, అండర్-19 విభాగంలో బాక్సింగ్ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటేష్ తెలిపారు. అనంతపురంలోని స్పోర్ట్ అథారిటీ కేంద్రంలో బుధవారం జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఆదర్శ పాఠశాలకు చెందిన 11మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 27 నుంచి 29 వరకు కృష్ణాజిల్లా విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయిపోటీల్లో పాల్గొననున్నారు.





ప్రతిభకు మెరుగులు

'ఈనాడు' ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణంలో ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అంతర్జాలంతో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక, మాధమాలు ప్రభావం ఏ విధంగా ఉంది. అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సహంగా పాల్గొన్నారు. విజేతలగా నిలిచిన గౌషియా సుల్తాన్, గీతిక, మహమ్మద్ ఇర్ఫాన్‌లకు ప్రధానోపాధ్యాయులు భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు మధుసుధన్, రాధాకృష్ణ బహుమతులు ప్రదానం చేశారు.

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం, గుంతకల్లు గ్రామీణం



రాకపోకలకు అవస్థ

తాడిపత్రి మండలంలోని గంగాదేవిపల్లి గ్రామంలో చిన్నపాటి వర్షానికే రహదారులపై వర్షపు నీరు చేరుతోంది. నెలల తరబడి నిల్వ ఉండటంతో బురదగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పండించిన పంటలను ఇంటికి తెచ్చుకునేందుకు ఆగ్రామ రైతులు బురదలో రాలేక అవస్థలు పడుతున్నారు. దీనిపై ఈవోఆర్డీ వెంకటేష్‌ను వివరణ కోరగా వెంటనే ఆ గ్రామ కార్యదర్శిని పంపి సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

-న్యూస్‌టుడే, తాడిపత్రి

సేవల్లో అంతులేని జాప్యం

- మేజర్ పంచాయతీకి కార్యదర్శి లేరు
- పనులు సాగక ప్రజలు బేజారు



జనన ధ్రువీకరణ పత్రాలకు కోసం విజ్ఞాపనలు సమర్పిస్తున్న ప్రజలు

యాడికి, న్యూస్‌టుడే: యాడికి మేజర్ పంచాయతీలో రెగ్యులర్ కార్యదర్శి అందుబాటులో లేని కారణంగా పాలన గాడి తప్పింది. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు అధికారి లేకపోవడంతో నిరాశగా వెనుతిరుగుతున్నారు. గతంలో పనిచేసే ఈఓ ఎర్రిస్వామి అనారోగ్య రీత్యా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. అప్పటి నుంచి దాదాపు ఆరు నెలలు రెగ్యులర్ అధికారి లేక సమస్యలు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారుల బదిలీలు జరిగాయి. ఇందులో భాగంగా యాడికి పంచాయతీకి నార్పల పంచాయతీ నుంచి అశ్వర్థమనాయుడు బదిలీపై వచ్చారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన రోజునే సెలవుపై వెళ్లి ఇంత వరకు రాలేదు.

క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి

ప్రభుత్వం విద్యార్థులకు ఇటీవల అపార్ నమోదు ప్రక్రియ ప్రవేశపెట్టింది. విద్యార్థులకు జనన ధ్రువపత్రాల కోసం నిరీక్షిస్తున్నారు. మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, వీధి దీపాలు, పరిశుభ్రత, తదితర విభాగాలపై పర్యవేక్షణ కొరవడింది. పంచాయతీలో ఐదు సచివాలయాలు ఉండగా, ఇందులోని ఉద్యోగుల పాలనలోనూ పర్యవేక్షణ లోపించింది. నగరూరు కార్యదర్శి మురళీకృష్ణ సెలవుపై వెళ్లడంతో ఈ పంచాయతీలో కూడా స్థానికులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. రెండు పంచాయతీలకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలను ఎవరికీ అప్పగించలేదు. ఈ విషయంపై ఈఓఆర్డీ శశికళను సంప్రదించగా సొంత పనుల నిమిత్తం సెలవుపై వెళ్లారని, మూడు రోజుల్లో విధుల్లోకి వస్తారని పేర్కొన్నారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి



బీసీ బాలుర వసతి గృహంలో భోజనం పరిశీలిస్తున్న న్యాయమూర్తి మంజుల

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: పిల్లలకు పోషకాహారం అందించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, గుంతకల్లు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మంజుల పేర్కొన్నారు. గుంతకల్లులోని పాత గుంతకల్లులో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో వంటగదిని పరిశీలించి టమాటా కర్రీ, సాంబారు పరిశీలించారు. విద్యార్థుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడుగగా బాగుంటుందని చెప్పారు. పిల్లలకు మంచి ఆహారం అందించాలని వసతి గృహ సంక్షేమ అధికారిణికి సూచించారు. అనంతరం అక్కడ నుంచి న్యాయమూర్తి అనాథాశ్రమానికి వెళ్లారు. ఈకార్యక్రమంలో సీఐ ఏబీ మస్తాన్, న్యాయవాది, కోర్టు సిబ్బంది పవన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడో.. ఇప్పుడో



మండలంలోని మలుకలపెంట లోని ఇళ్ల మధ్య ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు పెచ్చులూడుతోంది. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని జనం భయం పడుతున్నారు. గ్రామంలోని 1500 వందల కుటుంబాలకు నీటిని నీటిని సరఫరా చేసే ట్యాంకు పాతబడిపోవడంతో ఇబ్బందిగా మారింది. కూలగొట్టి నూతనంగా ట్యాంకు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఈఓఆర్డీ నాగభూషణం వివరణ కోరగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

-న్యూస్‌టుడే, గుంతకల్లు గ్రామీణం